ఖండసరి చక్కెర కాశీమజిలీలు

సుందర్రామయ్యకి ఖండసరి చక్కెరతో సంపర్కం ఎల్లా ఏర్పడిందంటే - చినబాబుగారి ద్వారా. అయితే చిన్నబాబుగారికీ ఖండసరి చక్కెరకూ ఎలాంటి సంబంధమూ లేదు. ఆయనకు కలిగిన సంపర్కమల్లా బుచ్చినాయుడు తోటి.

బుచ్చినాయుడు పెద్ద పలుకుబడిగల ఊరి పెద్ద. అంటే స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పలుకుబడీ, పెద్దరికం సంపాదించిన వ్యక్తి. బుచ్చినాయుడు తండ్రి సూరవనాయుడు పెదబాబుగారి జమీలో కాసావాడు. జమీ పోయాక పెదబాబుగారు పోయాక. చినబాబుగారికి మిగిలిందల్లా వెనుకటి హోదా. జమీందారీ కుటుంబంలో పుట్టినవారికి మరో పని చెయ్యడానికి తరిఫీదు గాని, మనస్సుగాని లేనికారణంచేత వారు వెనకటి తరాలవారు చేసినపనులే ఇప్పుడు చేస్తున్నారు. ఒక్క జమీ పరిపాలించడం తప్ప. తమ పలుకుబడి ఇంకా తరిగి పోలేదని వారి అనుమానం. ఆ పలుకుబడి నిజంగా ఉందోలేదో తేల్చుకోడానికి వారికి కొంచెం సంకోచం. అయితే సూరవనాయుడు కొడుకు ఎమ్.ఎల్.ఎ. ఐతే తమకి చిన్నతనంగా ఉంటుందని ఆయనకి తెలుసు. ఎందుకంటే, చినబాబుగారు

కాంగ్రెసు ప్రమాణపత్రం సంతకం పెట్టి, తమ ప్రాంతానికి ఎమ్.ఎల్.ఎ. అభ్యర్థిగా తమర్ని నిర్ణయించవలసిందిగా దరఖాస్తు పెట్టారు కాంగ్రెసుకార్యవర్గానికి. అయితే బుచ్చినాయుడు కూడా దరఖాస్తు పెట్టాడన్న సంగతి మొదట్లో ఆయనకు తెలీదు. తీరా కాంగ్రెసు అభ్యర్థిగా బుచ్చినాయుణ్ణి కాంగ్రెసువారు నిర్ణయించారని తెలియగానే ఆయనకు అరికాలిమంట నెత్తికెక్కింది. తనకన్నా బుచ్చినాయుడులో ఏమి ఘనత ఉందని కాంగ్రెసు వారతన్ని నిర్ణయించారు? పోనీ తనకన్నా బుచ్చినాయుడు ఎక్కువ కాంగ్రెసు మనిషా? వాళ్ళ నాన్న సూరవనాయుడు కూడా పెదబాబుగారితోపాటు జస్టిసు పార్టియేగా వెనుకటి రోజుల్లో. అందులో నాయకుడన్నా కాడు. కేవలం పెదబాబుగారి సేవకుడు. అనుచరుడు. అయితే బుచ్చినాయుడికి వ్యతిరేకంగా స్వతంత్రపార్టీ తరపున నిలబడడానికి ఆయనకి చిన్నతనమనిపించింది. అంచేత స్వతంత్రపార్టీ తరపున బుచ్చినాయుడు మేనత్తకొడుకైన గోపీనాయుణ్ణి నిలబెట్టి దండిగా డబ్బు ఖర్చు పెట్టి, బుచ్చినాయుణ్ణి ఓడించారు. బుచ్చినాయుడు సామాన్యుడా గోపీనాయుడు మైనరైనందున - అతని ఎన్నిక పత్రంలో వయస్సు తప్పుగా వేసినందున, అతని ఎన్నిక చెల్లదని దావావేసి, రద్దుచేయించాడు. ఈ లావాదేవీల మూలంగా రుజువైనవి రెండు - బుచ్చినాయుడు కన్నా, చిన్నబాబుగారి పరపతి ఎక్కువ - ఆ ప్రాంతాల్లో. అయితే - పైకి వెళ్ళినకొద్దీ - అంటే రాజకీయనిచ్చెనమెట్లు ఎక్కినకొద్దీ - బుచ్చినాయుడు పరపతి ఎక్కువది.

అయితే ఎవరి పరపతి ఎక్కువ? అన్న మూలసమస్య తేలకుండానే ఇద్దరికీ రాజీ కుదిరిపోయింది. ఒకటి రెండు పరిస్థితులు ఆ రాజీకి దోహదం చేశాయి. ఒకటి గోపీనాయుడు ఎన్నికలకు చిన్నబాబుగారు చాలా అప్పులు చేశారు. అంచేత ఆయనకి దినవెచ్చానికిప్పుడు అప్పులు పుట్టడం కష్టమైపోయింది. ఇంక బుచ్చినాయుడు విషయం. చినబాబుగారు ఎదురు తిరిగితే తను ఎమ్.ఎల్.ఎ. కావడం

కష్టం. ఈరకంగా పదునుపడ్డ నేలమీద మన సుందర్రామయ్య రాజీకి విత్తనాలు జల్లాడు.

తామరసాక్షి ఇంటివద్ద ఒక రాత్రి ఇద్దరికీ సమావేశం ఏర్పాటు చేశాడు. మనోల్లాసకర ద్రవ్యాలు బుచ్చినాయుడు తెచ్చాడు. మంచి కోడికూర చినబాబుగారు చేయించారు. తామరసాక్షి రెండూ ఇద్దరికీ వడ్డించింది. కొంత సఖ్యం ఏర్పడి, బుచ్చినాయుడూ, చినబాబుగారూ ఒకరి నొకరు కౌగలించుకుని, కంటతడి పెట్టుకుంటూ, వెనుకటి రోజులు తడబాటు మాటల్లో గుర్తు తెచ్చుకోడం మొదలెట్టాక, తనొక గ్లాసు తెచ్చుకుని సుందర్రామయ్య వారిపక్కన వచ్చి కూర్చున్నాడు.

ఆ రాత్రి నోటూ పత్రం లేకుండా ఇరవైవేలు బుచ్చినాయుడు చినబాబుగారి కిచ్చాడు. చినబాబుగారు ఒక వెయ్యి సుందర్రామయ్య కిచ్చారు. పన్నెండు వేలు తామరసాక్షి వజ్రాలహారం కొనుక్కోడాని కిచ్చారు. మిగిలిన సొమ్ము తమతాలూకు చిల్లర బాకీలు తీర్చడానికి సుందర్రామయ్యకే ఇచ్చారు.

ఐతే ఒక చిక్కుపరిస్థితి ఏర్పడింది.

డబ్బు అవసరంవచ్చినప్పుడల్లాచినబాబుగారు సుందర్రామయ్యని బుచ్చినాయుడుదగ్గరకు పంపుతుండేవారు. ఐదు సంవత్సరాల అనంతరం రాబోయే ఎలెక్షన్ మింజుమలె - సంవత్సరానికి దాదాపు అరవైవేల చొప్పున 'రాజా' వారికి పెట్టుబడో, అప్పో, దానమో తెలియని పరిస్థితిలో ఇవ్వడం బుచ్చినాయుడికి కొంచెం బాధగానే ఉంది. అయితే ఇవ్వనంటే, ఇచ్చిందంతా పోతుంది. పైగా ఎన్నికల్లో దెబ్బ. బుచ్చినాయుడు నుయ్యికీ, గొయ్యికీ మధ్యపడ్డాడు. ఈ విషయం ఇలా మూకఉమ్మడిగా అట్టేపెట్టడం ఇష్టంలేక, సుందర్రామయ్యతో సంప్రతించాడు. అసలు చినబాబుగారి మనస్సేమిటో కాస్త సూచనగానైనా తెలుస్తుందని సుందర్రామయ్య అన్నాడు:

"నాయుడూ, చినబాబుగారికి రాబడినున్నా, ఖర్చు తగ్గలేదు. నువ్వే ఏదో సంపాదన ఏర్పాటుచేసి, అందులోంచి నీ బాకీ మినహాయించుకోవాలి. ఒకవేళ ఇంతవరకూ ఇచ్చింది. ఆయన బాకీ కింద

లెక్క కట్టుకోకపోయినా, యికమీద నీ దగ్గరకు అప్పుకి రాకుండా ఉంటే అదే పదివేలు."

"ఆరికి సంపాద నెట్టాగబ్బా ఏరుపాటు జేసేది?" అన్నాడు బుచ్చినాయుడు.

"చూడు నాయుడూ, నీ చేతులో లక్షా తొంభై వ్యాపారాలున్నాయి. అందులో ఒకటన్నాసరే - లేదంటావా. ఏదన్నా కొత్త వ్యాపారమన్నాసరే - ఆయన పేర పెట్టు. తంటాలు పడ్డానికి నేనున్నాను. ఇంకో చిన్న రహస్యముంది. నీ దగ్గర 'బ్లాక్' డబ్బు చాలా వుంది. చినబాబుగారిని అడ్డెట్టుకుని అదంతా 'వైట్' చెయ్యడానికి నీకో మార్గం చూపిస్తాను."

"ఎట్టాగయినా కరణంబుర్ర కరణంబుర్రే" అన్నాడు నాయుడు. అప్పుడాలోచించాడు ఖండసరి చక్కెర వ్యాపారం సంగతి.

నాయుడి రాజకీయ మిత్రుడి కొకరికి విశాఖపట్నం జిల్లాలో ఒక ఖండసరి చక్కెర ఫాక్టరీ ఉంది. సరుకు చాలా దిగబడిపోయిందనీ, మద్రాసు, కేరళ, మైసూరు రాష్ట్రాలకు దాన్ని ఎగుమతి చేసినట్టయితే మంచి లాభా లొస్తాయనీ అత నోసారి అన్నాడు నాయుడితో. చిన బాబుగారి పేరుతో, నాయుడి డబ్బుతో సుందర్రామయ్య సంతకం హక్కుతో ఖండసరి చక్కెర అమ్మకం కంపెనీ ఒకటి తయారయింది.

వెయ్యి రూపాయలు చేత పుచ్చుకుని సుందర్రామయ్య మద్రాసులో దిగాడు. సెంట్రల్ స్టేషన్ పక్కనున్న ఒక హొటల్లో మకాంపెట్టాడు. తామరసాక్షి దూరపుచుట్టం ఒకాయన తన ఇద్దరు కుమార్తెలతో పాత మాంబళంలో ఉంటున్నాడు. కుమార్తెలు సినీమాల్లో చిన్నచిన్న వేషాలే వేస్తున్నా, పెద్ద ఖరీదైన దుస్తులే వేసుకుంటున్నారు. సుందర్రామయ్య వెళ్ళి, 'బావనీ' 'కోడళ్ళ'నీ పరామర్శ చేశాడు. ఎలెక్ట్రిక్ ట్రెయిన్ ఎక్కి సెక్రటేరియట్ మహాసముద్రంలో పడ్డాడు. ఆరితేరిన కరణం గనక, మునిగిపోకుండా మెల్లగా అడంగుకి చేరుకోడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఆ ప్రయత్నంలో కొంత చిన్నతెప్పలా సహాయపడ్డవాడు పీతాంబరం. అత నొక గుమాస్తా - కొంత వయసు మళ్ళిన గుమాస్తా. అతను తోటి గుమాస్తాల నడిగి విషయం తెలుసుకుని, ఆఫీసు టైపు రైటర్ మీద ఒక దరఖాస్తు టైపు చేసి, అది ఎక్కడ నమోదు చేయించాలో అక్కడ చేయించి, తన శ్రమకి ప్రతిఫలంగా ఒక ఏభై రూపాయలు పుచ్చుకున్నాడు.

"నువ్వేం దిగులు పెట్టుకోమాక. వొస్తాదిలే పరిమిట్టు. నే నుంటి నిగా" అన్నాడు డబ్బు పుచ్చుకుంటూ. సుందర్రామయ్య సగం పని అయినట్టు సంతోషించి, హొటలుకి వెళ్ళి సుఖంగా భోజనంచేసి నిద్రపోయాడు.

పర్మిట్టు రావడానికి వారంరోజులన్నా పడుతుంది. ఈలోగా ఇంటికి వెళ్ళి తిరిగిరావడం అంటే శ్రమ; పైగా రైలు ఖర్చుల కింద అయేది హొటలు బిల్లుకి సరిపోతుంది. అంచేత ఆ వారం రోజులూ మద్రాసులోనే ఉండిపోయాడు సుందర్రామయ్య. లాంఛనానికి పదిగంటలకి సెక్రటేరియేట్ కి వెళ్ళేవాడు. ఆతరవాత గని రాజు -అంటే తామరసాక్షి దూరపు అన్నగారు-ఇంటికి వెళ్ళి 'కోడళ్ళ'తో కబుర్లు చెప్పేవాడు. సాయంత్రం ఆరుగంటలవేళ పీతాంబరం 'బాబాయి' ఇంటికి వెళ్ళి, 'పిన్నమ్మ'నీ పిల్లల్నీ పరామర్శించి ఎనిమిది గంటలకి హొటలుకి చేరుకునేవాడు. ఇదీ అతని దినచర్య.

సరిగ్గా, పీతాంబరం చెప్పినట్టే, వారం రోజుల్లో దరఖాస్తుకి సమాధానం వచ్చింది, సెక్రెటేరియట్ నించి.

సుందర్రామయ్య కవరు చింపి చదివాడు. మంచిమర్యాదగల ఆంగ్లభాషలో ఉంది ప్రభుత్వ ఉత్తరం. సారాంశం ఏమిటంటే:

'ఖండసరిచక్కెర యనగా నేమి? దరఖాస్తుదారు ఈ విషయమును స్పష్టముగా వివరింప ప్రార్థన."

పీతాంబరం కింద సంతకం చూశాడు.

"ఓరి పీడి తస్సాల్ చెక్క: మా రామయ్యర్గాడు. వాడిలాంటి పనులే చేస్తుంటాడు."

ఖండసరి చక్కెర దిగుమతి దరఖాస్తు రామయ్యార్ దగ్గరకు వేరిందన్నమాట. ఇది మొదటి మజిలీ.

* * *

రామయ్యార్ ఇల్లు ట్రిప్లికేన్‌లో దక్షిణ మాడావీధిలో ఉంది. ఆయనకు అరుగురు సంతానం. భార్య ముక్కున వజ్రపు ముక్కుపుడక ఉంది. దానిమీద వెలుగుపడి మెరవడానికిగాను, ఆమె మేలుకున్న ఘడియలన్నీ పెదవులూ, ముక్కూ కదుపుతూ మాట్లాడుతుంది. అరుగురు పిల్లలూ ఆంగ్ల తమిళభాషల్లో పాఠాలు వల్లిస్తుంటారు. అంచేత వాళ్ళ ఇల్లు నిత్యపూజ జరుగుతున్న పార్థసారథి స్వామివారి ఆలయంలా ఉంటుంది. అదే కారణంగా రామయ్యార్‌కి గొంతుక పెంచి మాట్లాడ్డం అలవాటైపోయింది.

అరుగంటల ప్రాంతాన్ని రామయ్యార్ ఇంటికి వెళ్లారు, పీతాంబరం సుందర్రామయ్యా కలిసి. ప్రభుత్వ సమాధానం అతని చేతికే ఇచ్చారు. రామయ్యార్ అది చదువుకుని -

"ఎన్న పీతాంబరం - నమ్మ ఫ్రెండన్ను ఒరువార్త శొల్ల కూడాదు?" అన్నాడు. ఆ తరువాత అసలు ఖండసరి చక్కెర అనబడే పదార్థం ఏమిటి ? అన్న విషయం చర్చకు వచ్చింది.

"చక్కెరే అనుకోండి. కొంచెం సన్నగా ఉంటుంది. రంగు తక్కువ. ఐతే రెట్టింపుతీపి ఉంటుంది" అన్నాడు పీతాంబరం.

"పార్కలామే" అన్నాడు రామయ్యార్.

ఈ 'పార్కడ్డం, ఖండసరి చక్కెరనిగాని కాగితాన్ని కాదని సూక్ష్మబుద్ధిగల సుందర్రామయ్యకు అర్థమైంది.

అర్థమయ్యేగు ఖండసరి చక్కెర అర్జంటు టెలిగ్రాం ఇచ్చి తెప్పించాడు, ఎందుకైనా మంచిదని - కరణంగనక - రెండు వీశెలేనని చెప్పి - పీతాంబరానికీ, రామయ్యార్‌కీ చెరొక వీశె ఇచ్చాడు.

ఖండసరి చక్కెర మామూలు చక్కెరకన్న బాగా తీపిగా ఉంటున్నదని, రామయ్యార్ పిల్లలు రుజువుచేసిన మీదట, మరొక రెండు

వీశెలు. తిరిగి తెప్పించినట్టు నాటకమాడి పీతాంబరానికి తెలీకుండా రామయ్యర్ భార్యకి ముట్టజెప్పినమీదట, దరఖాస్తు రామయ్యర్ బల్లమీదినుంచి, సంబంధం మొదలియార్ బల్లమీదికి చేరుకుంది. ఇది – రెండవ మజిలీ.

* * *

సంబంధం మొదలియార్‌కి చాలా ముఖ్యమైన 'సంబంధా' లున్నాయి. అంచేత అతనికి అతి తొందరగా ప్రమోషన్లు వస్తుంటాయి. అంచేత సెక్రెటేరియట్‌లో గుమాస్తాలకందరికీ అతనంటే భయమూ, భక్తీ, ఈర్ష్యా. అసిస్టెంట్ సెక్రటరీ తరహా వాళ్ళకి కొంత భయమూ, ఎక్కువ ప్రేమా.

అతను రామయ్యర్‌లాగ 'పార్కలామే' అనడు; 'పట్టుకోరా.' అంటాడు. అతనికొచ్చిన తెలుగుపదం అదొక్కటే. ఎల్లాగైనా సుందర్రామయ్య కరణంబుర్రగదా.

"నూటయాభై టన్నులు గోడౌన్‌లో మూలుగుతోంది బాబు: తమరికి వీశె, అరవీశె అయితే ఏమూలకి? త్వరగా దిగుమతి పర్మిటు పారేయించారంటే, ఓ మణుగు తమ ఇంటికి చేర్చిస్తాను. లేకపోతే ఎక్కువగా తెప్పించడానికి వీలుండదు; పట్టుకుంటారు" అన్నాడు లౌక్యంగా.

"ఓ" అన్నాడు సంబంధం మొదలియార్. పర్మిటు అతి త్వరలో ఇచ్చెయ్యొచ్చని నోట్ రాసి, అసిస్టెంట్ సెక్రటరీ పుట్టకట్ దగ్గరకు పంపించాడు. ఇది - మూడవ మజిలీ.

* * *

ఇక నాలుగవ మజిలీ.

పుట్టకట్ కేరళీయుడు. అతడు అందరితోనూ అతికులాసాగా ఉంటాడు. అయితే అతనికి రూల్సన్నీ కంఠస్థం. ఈ కంట్రోళ్ళ రోజుల్లో రోజు రోజుకీ వందలకొద్దీ పుడుతున్న రూల్సు, ప్రభుత్వ

ఆర్డర్లు గుర్తుంచుకోడం గుమాస్తాలకి సాధ్యమా? అతనికి కింద గుమాస్తాలతో ఆడుకోడం సరదా.

గుమాస్తా నోటురాసి అతని దగ్గరకు పంపిస్తాడు. అతను తిరిగి నోటురాసి, ఆ గుమాస్తా దగ్గరకే పంపిస్తాడు.

"డివి 6-2-64 న మంత్రివర్గ నిర్ణయాలను జాగ్రతగా చదువుకుని మరీ నోట్ వ్రాయవలసిందిగా ప్రార్థన."

"ప్రార్థన" అనిమాత్రం అతని ప్రతినోటులోనూ ఉంటుంది. చాలా మర్యాదస్తుడు.

గుమాస్తా అది చదువుకుని, ఆ ఫలానా మంత్రివర్గ నిర్ణయాలను జాగ్రత్తగా పరిశీలించి, మరొక నోట్ రాసి, పుట్టకట్ గారి ఆమోదం సంపాదించాననుకుంటాడు. కాని అక్కడే పప్పులో కాలువేస్తాడు. పుట్టకట్ తిరిగి నోటు వ్రాసి ఆ గుమాస్తాకే పంపిస్తాడు.

"శ్రీయుత గుమాస్తాగారికి నేత్రదోషమా? లేక అంతకన్నా ప్రమాదకరమైన మానసికదోష మేమన్నా ఉందా? వెంటనే వైద్య సలహా పొందడం అవసరమేమో నని నా స్నేహపూర్వక సూచన. మంత్రివర్గ నిర్ణయ పత్రానికి వెనక షరా ఉన్న సంగతి పాపం వారికగమ్యం కావడం విచారకరం. చూ. ప్రభుత్వ ప్రకటన ఆఖరు పుట అడుగున మూడవ షరా."

ఈవిధంగా ఒక్కొక్క కాగితం ఉయ్యాల ఊగి ఊగి పైకో, మరొక మెట్టు కిందకో పోవడం సంప్రదాయం.

సుందర్రామయ్య దరఖాస్తు పుట్టకట్ దగ్గరనుంచి, తిరిగి సంబంధం మొదలియార్ దగ్గరకే వొచ్చింది. దానిమీద సంబంధం మొదలియార్ కాగితం చేత పుచ్చుకుని స్వయంగా పుట్టకట్ దగ్గర కొచ్చి నవ్వుతూ -

"అణ్ణా!" సంబోధనతో ప్రారంభించి, ఈ దరఖాస్తు ఆమోదించి, ఖండసరి చక్కెర దిగుమతి పర్మిటు, ఇవ్వడానికి ఏ రూల్సు ఒప్పుకుంటాయో చెప్పమని అడిగినమీదట, సంబంధం మొదలియార్ కున్న ఇతర సంబంధాల దృష్ట్యా పుట్టకట్ - ఆ రూలు వివరించాడు.

అది ఉదహరించి సంబంధం మొదలియార్ స్వయంగా పై అంతస్తుకి తీసుకుపోయాడు దరఖాస్తుని. ఇది - నాలుగవ మజిలీ అని ముందరే వివరించాం.

అయిదవ మజిలీ పై అంతస్తులో ఉందని మాత్రమే సుందర్రామయ్యకి తెలుసు. సంబంధం మొదలియార్ ఆ మూలవిరాట్టును "వారు" అని మాత్రమే అంటాడు. పేరు తెలిస్తే అటునించి నరుక్కురావచ్చునని సుందర్రామయ్య ఆశ. అయితే తన కింద సహాయం చేస్తున్న సంబంధం మొదలియార్‌ని "వారి" పేరు అడగడం సమంజసం అవునో కాదో అర్థం కాలేదు.

*　　　　*　　　　*

అయిదవ మజిలీ కాస్త పెద్దది. అక్కడికి ఏ కాగితమన్నా చేరడమూ కష్టమే. చేరిన తరువాత ఊడిపడ్డమూ కష్టమే.

ఆరు రోజుల అనంతరం సంబంధం మొదలియార్ ఒక వార్త తెచ్చాడు. ప్రభుత్వానికి దిగుమతి పర్మిటు ఇవ్వడానికి ఏమీ అభ్యంతరం లేదు. అయితే మద్రాసులో ఏ వ్యాపారస్థుడయినా అది కొనడానికి అంగీకారం తెలియజెయ్యాలి. అంచేత ఒకణ్ణి ఎవణ్ణయినా పట్టి, అతను ఎంతకొనడానికి సిద్ధంగా ఉన్నాడో ఒక ఉత్తరం పట్టుకొచ్చి దరఖాస్తుకు జతపరిస్తే అరగంటలో వస్తుంది పర్మిట్టు.

సుందర్రామయ్య గోడౌన్ వీధిలో పడ్డాడు. నాలుగయిదు రోజులు తిరిగాక అతని కర్థమైన దేమంటే, ఖండసరి చక్కెర అమ్మకంవల్ల ఏమాత్రం శాతం లభిస్తుందో ఆ వర్తకులు తేల్చుకో లేకుండా ఉన్నారు. అంచేత వాళ్లేమన్నారంటే, ముందు దిగుమతి చెయ్యండి. ఆ తరువాత అందరం కొంటాం అన్నారు. వాళ్ళ దృక్పథం ఏమిటంటే, నాటయే బైటన్నులు ఇప్పుడునాలుగు వందలమైళ్ళ దూరంలో సురక్షితంగా ఉంది. అవి మద్రాసు ముందు తీసుకువస్తే, బీమలూ, ఇతర క్రీములూ కలుగజేసుకుంటే, ఇంక తాము అడిగిన ధరకు అది చేతులో పడుతుంది.

అయితే సుందర్రామయ్య కరణం. సంబంధం మొదలియార్‌తో పరిస్థితంతా చర్చించాడు.

"వాళ్ళూ వీళ్ళూ తింటే మనకి మిగిలేదేముందండి, మావాడొక డున్నాడిక్కడ. గనిరాజని - బాగా ఉన్నవాడేలేండి. వాణ్ణి కిరాణా వ్యాపారస్థుల జాబితాలో చేర్పించండి. మీ కష్టం మేం ఉంచుకోం."

"మీ కష్టం మేం ఉంచుకోం" అన్నపదానికి అర్థం క్రియా రూపంగా సంబంధం మొదలియార్‌కి ఇదివరకే అర్థమైంది. అదీగాక గనిరాజు కిద్దరు "సినీతారలు" కూతుళ్ళున్నారనీ మంచి హుషారయిన వాళ్ళనీ, చాలా మంచి పిల్లలనీ మాటల సందర్భంలో వదిలాడు సుందర్రామయ్య. అప్పుడు సంబంధం మొదలియార్ కళ్ళు మెరి శాయి.......

ఈవిధంగా రెండు శనివారాలు గడిచిన తరువాత సుందర్రా మయ్య దగ్గర డబ్బయిపోయింది. బుచ్చినాయుడికి రాశాడు. తనే వేరే పనిమీద వస్తున్నానని బుచ్చినాయుడు జవాబు రాశాడు.

* * *

ఇక ఆరవ మజిలీ.

ఆ మజిలీ చేరడానికి బుచ్చినాయుడు కారకుడు. అతనికోసం వుడ్‌లాండ్సులో గది ఏర్పాటు చేశాడు సుందర్రామయ్య.

ఆ రాత్రి సొంతపనిమీద "వారు" బుచ్చినాయుణ్ణి చూడానికి రావడం, కొంత బెట్టుసడలి సుందర్రామయ్యని వారు కౌగిలించు కునేదాకా రావడం, ఆ తదుపరి మర్నాడు పదకొండు గంటలకల్లా సెక్రటేరియట్‌కి వచ్చి పార్థసారథిని చూస్తే పర్మిటు చేతులో పెడ తాడని హామీ ఇవ్వడం - అతిసులభంగా జరిగిపోయింది.

పార్థసారధి చిరాకుమనిషి. అతని భార్య రాత్రి జెలగై అతని రక్తాన్ని పీలుస్తుంటుందని కొందరూ, అతనికి మూలశంక ఉండడం వల్ల ఇలా ఉంటున్నాడుగాని, అసలు మంచి మనిషేనని కొందరూ అంటుంటారు.

"వారి కేమయ్యా. వారు వరాలిచ్చేస్తూనే ఉంటారు, కాని రూల్సొప్పుకో వొద్దూ ?" అన్నాడు పార్థసారథి, దరఖాస్తు చూసి.

"అంటే ఇదివరకు ముగ్గురి కిచ్చారండీ." అంటూ ఆరునెల్ల క్రితం ఇచ్చిన దిగుమతి పర్మిట్లన్నీ ఉదహరించాడు సుందర్రామయ్య.

"మరి నెలా పదిహేనురోజుల క్రితం కొత్త రూల్సు రాలే ?" అని ఎదురుప్రశ్న వేశాడు పార్థసారథి.

సుందర్రామయ్య పార్థసారథి భార్యకి కంచిపట్టుచీర ఇచ్చి మంచి మాట చేసుకున్నాక, నాలుగు వారాలు రూల్సన్నీ చదివి పార్థసారథి కాస్త చిరునవ్వుతో - 'పని జరుగుతుందిలే' అని హెచ్చరించాక - 'అమ్మయ్య' అనుకుని నిట్టూర్చాడు సుందర్రామయ్య.

ఆరురోజుల అనంతరం వచ్చిందొక ఉత్తరం.

"ఖండసరి చక్కెర ఉత్పత్తి ఆంధ్రరాష్ట్రంలో కావడంచేత, ఆంధ్రప్రభుత్వం వద్దనుంచి దరఖాస్తుదారు ఎగుమతి పర్మిటు తెచ్చినట్లయితే, మద్రాసులోకి దిగుమతి కొరకు పర్మిటును ఈ ప్రభుత్వం ఇస్తుంది" అని దాని సారాంశం.

అప్పటికి సుందర్రామయ్యవద్ద బుచ్చినాయుడిచ్చిన రెండో వెయ్యి ఖర్చైపోయింది - రెండుమాసాల హొటల్ బిల్ కీ, తన ప్రయాణపు ఖర్చులకీ ఆరువందలు మనియార్డరు తెప్పించుకుని, సుందర్రామయ్య హైదరాబాదుకి ప్రయాణమయ్యాడు.

హైదరాబాదు సుందర్రామయ్యకు కొట్టిన పిండి. అంచేత ఖండసరి చక్కెర ఎగుమతి పర్మిటుకోసం సెక్రటేరియట్‌లో దరఖాస్తు పెట్టి అది అడంగుకి చేరడానికి ఏర్పాటుచేసి, సుందర్రామయ్య పాత స్నేహితుణ్ణి చూడ్డానికి హిమయత్‌నగర్ వెళ్ళాడు. అనుకోకుండా అక్కడ తాజ్‌మహల్ హొటల్లో కాఫీకని వెడితే అక్కడ తారసిల్లాడు రామేశం.

రామేశం బుచ్చినాయుడికి స్నేహితుడు, ఎమ్. ఎల్. ఏ .... ఖండసరి చక్కెర ఫాక్టరి యజమాని.

కాఫీ తాగుతూ, అతను యధాలాపంగా చెప్పిన చావుకబు రేమి
టంటే కేరళ ప్రభుత్వంవారు దిగుమతి పర్మిటిచ్చిన కారణంగా,
వారంరోజులక్రితం నూటయాభై టన్నుల చక్కెర అతడు ఎర్నా
కుళానికి ఎగుమతి చేసేశాడు. ఈయాత్రా ఫలితంగా, గనిరాజు
కుమార్తెలు రెండుమూడు తమిళ చిత్రాల్లో కూడా చిన్నవేషాలు
వేస్తున్నారు. సుందరరామయ్య దరఖాస్తు హైదరాబాదు సెక్రటే
రియట్‌లో మజిలీలు దాటుతోంది మెల్లగా, ఈనాటివరకూ దాని
యాత్ర ముగియలేదు.

ఖండసరి చక్కెరమాత్రం తనకాశీ చేరుకుంది.